క్లుప్తంగా

నియామకం


వక్కాల కుమార్

కాజీపేట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా వక్కాల కుమార్ మాదిగను నియమించారు. కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీకి చెందిన కుమార్‌ను గురువారం నియామకపు ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ రమేష్ కుమార్ మాదిగ, పిల్లి క్రిష్టఫర్ మాదిగలు పాల్గొన్నారు.

డాక్టర్ తిరుమల్‌రావు జన్మదిన వేడుకలు



హసన్‌పర్తి: ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ తిరుమల్‌రావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. భీమారంలోని ఎస్‌వీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తిరుమల్‌రావు కేక్ కట్ చేశారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌వీఎస్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి సువర్ణ, కార్యదర్శి ఎర్రబెల్లి అనూప్‌కుమార్, డైరెక్టర్ డాక్టర్ హర్షిణి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సఖి' సెంటర్ సేవలు వినియోగించుకోవాలి



కాజీపేట: మహిళలు సఖి సెంటర్ ఉచిత సేవలను వినియోగించుకోవాలని కేస్ వర్కర్ వినిలా అన్నారు. కాజీపేట చౌరస్తా సమీపంలో గురువారం సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన మహిళ సదస్సులో సఖి సెంటర్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైనప్పుడు మహిళలు 0870–2452112 లేదా 181 నంబర్‌కు ఉచితంగా కాల్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్.కరుణ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

'మల్లికాంబ' విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



హన్మకొండ అర్బన్: హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు ఓరుగల్లు ఐ హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ వి.శ్రీకుమార్ తన కుమార్తె రోహిణి పుట్టిన రోజు సందర్భంగా గురువారం ఉచితంగా కంటిపరీక్షలు చేయించి అవసరం ఉన్నవారి అద్దాలు, మందులు అందజేశారు. అల్‌కీమ్ ఆప్టీమస్, సెన్సస్ ఫార్మసుటికల్స్ వారి సహకారంతో కార్యక్రమం విజయవంతం చేసినట్లు డాక్టర్ శ్రీకుమార్ తెలిపారు. వసనర్తి శ్రీధర్, వంగ శ్రీనాధ్, మల్లికాంబ నిర్వాహకులు బండ రామలీల, కొడం కళ్యాణ్ తదితరులు ఉన్నారు.

ఆర్‌బీఎస్‌కేలో ఉద్యోగ అవకాశాలు

గీసుకొండ : జిల్లాలోని ఆర్‌బీఎస్‌కే డీఈఐసీ వరంగల్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఎంబీబీఎస్ మెడికల్ ఆఫీసర్(1), ఎర్లీ ఇంటర్వెన్షన్ కం స్పెషల్ ఎడ్యుకేటర్ (1) పోస్టులను భర్తీ చేయడానికి హైదరాబాద్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. మల్టీ జోన్ –1 (1, 2, 3, 4 జోన్లు)కు సంబంధించిన అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 18న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

గీసుకొండ : వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఫార్మసిస్టుల సమస్యలను ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు పరిష్కరించాలని ఫార్మసిస్టుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిని సుదర్శన్‌గౌడ్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఫార్మసిస్టుల సర్వీసు రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతీ ఫార్మసిస్టుకు నాలుగు పదోన్నతులు ఇవ్వాలని, డీఎంహెచ్ఓ కార్యాలయాల్లో ఫార్మసీ స్టోర్స్‌లో ఫార్మసి సూపర్‌వైజర్లను నియమించాలని, డ్రగ్‌ఇన్‌స్పెక్టర్, అనలిస్టు పోస్టుల భర్తీలో ఫార్మసిస్టులకు 30 శాతం కోటా ఇవ్వాలని కోరారు. ఫార్మసిస్టుల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మోదుంపల్లి అవినాష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందకట్ల శరత్‌బాబు పాల్గొన్నారు.

కొత్త మండలాలు.. అద్దె భవనాలు

- అద్దె గదుల్లోనే కార్యాలయాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు, సిబ్బంది


కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో అద్దె భవనంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం

కాజీపేట: పాలనా సౌలభ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏడేళ్ల క్రితం కొత్త మండలాలు ఏర్పాటు చేసినా.. అన్ని శాఖలకు కార్యాలయాలు, సొంత భవనాలు సమకూర్చలేదు. దీంతో అధికారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాల్లో అవస్థలు తప్పడం లేదు. రాష్ట్రంలో 2016 సంవత్సరంలో కొత్త మండలాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. హనుమకొండ మండలం నుంచి కాజీపేటను వేరు చేసి 10రెవెన్యూ గ్రామాలతో మండలంగా ప్రకటించారు. ఇక నాటినుంచి మండల తహసీల్దార్, ఎక్సైజ్, ఐకేపీ కార్యాలయాలు, డిస్పెన్సరీ ఆస్పత్రి, శాఖాగ్రంథాలయం, మీసేవ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. సొంత భవనాల కోసం ఇప్పటి వరకు స్థల సేకరణకు కూడా అధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. రూ.లక్షల్లో ప్రతినెల ప్రభుత్వ కార్యాలయాలకు అద్దె చెల్లిస్తున్నప్పటికీ సరైన వసతులు లేక సిబ్బందితోపాటు వివిధ అవసరాల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు. ఏ కార్యాలయంలోనూ సరిపడా గదులు, ఫర్నిచర్ లేకుండాపోయింది. తక్షణమే ప్రభుత్వం కొత్త మండలాల్లో శాశ్వత భవనాల నిర్మాణాల నిమిత్తం అవసరమైన నిధులను మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఖిలావరంగల్ కోటలో పర్యాటకుల సందడి


శిల్పాల ప్రాంగణంలో పర్యాటకులు

ఖిలా వరంగల్: గురువారం పలు రాష్ట్రాల వ్యవసాయ మార్కెట్ అధికారులు, పలు రాష్ట్రాల ఈపీఎఫ్ అధికారులు వేర్వేరుగా ఖిలావరంగల్‌కోటను సందర్శించారు. మధ్యకోటలోని శిల్పాల ప్రాంగణంలో సందడి కనిపించింది. కాకతీయుల కీర్తితోరణాల నడుమ నల్లరాతిలో నాటి శిల్పులు చెక్కిన అద్భుతమైన శిల్ప కళ సంపదను వారు ఆసక్తిగా తిలకించారు. అనంతరం రాతి, మట్టికోట అందాలు, కుష్‌మహల్‌ను సందర్శించి కాకతీయుల కళాఖండాలను తమ వెంట తెచ్చుకున్న కెమెరాలలో బంధించుకున్నారు. ఖుష్‌మహల్, శృంగారపుబావి, ఏకశిల గుట్ట, పార్కు, గుండచెరువు అందాలను చేశారు. కాకతీయుల చరిత్ర, విశిష్టతను కోట గైడ్ రవియాదవ్ వివరించారు. మార్కెట్ అధికారులు బియబాని, రాము గంగాధర్, రాజ్‌కుమార్, శివ, గట్టికొప్పుల అజయ్ ఉన్నారు.

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి

హసన్‌పర్తి: సర్కార్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు చేయూతనివ్వాలని మండల విద్యాశాఖ అధికారి రాంకిషన్‌రాజు పిలుపునిచ్చారు. వంగపహాడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ స్కూల్ ఉపాధ్యాయురాలు మహమూదా రూ.15వేలు విలువైన టై, బెల్ట్, ఐడీ కార్డులకు తన స్వంత ఖర్చులతో గురువారం బహూకరించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి, శోభారాణి, దోమ కుమార్ పాల్గొన్నారు.

శ్రావణ మాస పూజలు ప్రారంభం


వేయిస్తంభాల ఆలయంలో..


వేయిస్తంభాల ఆలయంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న డీసీ శ్రీకాంతరావు


మెట్టుగుట్టలో లింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

హనుమకొండలోని శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయం, మడికొండలోని శ్రీ మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసోత్సవాలు గురువారం ఉదయం ప్రారంభమయ్యాయి. వేయిస్తంభాల ఆలయంలో ఆలయప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో శ్రీరుద్రేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రుద్రార్చన మహానివేదన, పంచహారతి మంత్ర పుష్పం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జోన్ ఉపకమిషనర్ టి.శ్రీకాంతరావు జ్యోతిప్రజ్వలన చేసి శ్రావణ మాసోత్సవాలను ప్రారంభించారు. మెట్టురామలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనచార్యులు ప్రాతఃకాల మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

- హన్మకొండ కల్చరల్/మడికొండ

అవినీతి ఎమ్మెల్యేలపై చీటింగ్ కేసుపెట్టాలి

- ఏనుగుల రాకేష్‌రెడ్డి


హన్మకొండ: ధర్నాలో చేస్తున్న బీజేపీ శ్రేణులు


ఖిలా వరంగల్: తహసీల్ ఎదుట..

హన్మకొండ అర్బన్: అవినీతి ఎమ్మెల్యేలపై చీటింగ్ కేసులు పెట్టాలని బీజేపీ అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి పూర్తి స్థాయిలో అర్హులకు అందజేయాలని డిమాండ్‌తో గురువారం హనుమకొండ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఒక్కరికి కూడా దాస్యం వినయ్‌భాస్కర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. పూర్తి చేసిన ఇళ్లు అర్హులకు పంచకుండా కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అనుచరులు డబుల్ బెరూం ఇళ్ల పేరుతో వసూళ్లకు తెగబడ్డారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు రావుల కిషన్, అమర్‌నాథ్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, ఓంప్రకాష్, సారంగపాణి, వైరి శ్రావణ్, జన్ను మధు, బాపు, ఎల్లారెడ్డి, అనీల్, లక్ష్మణ్, నితిన్ తదితరులు ఉన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి

ఖిలా వరంగల్: అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్‌బాబు, రత్నం సతీష్ షా, గంట రవికుమార్ డిమాండ్ చేశారు. ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం బీజేపీ నేతలు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ నాగేశ్వర్‌రావును కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. పేదలకు డబుల్ బెడ్రూం నిర్మించి ఇస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి 9 ఏళ్లు కావస్తున్నా ఇవ్వట్లేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాట్టి శ్రీనివాస్, భాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, కాసు శిల్ప, అడెపు వెంకటేష్, ఇనుముల అరుణ్, రాజు, చంద్రమోహన్, లూథర్, జనార్ధన్, దయాల్, రజినీష్ నేత, ప్రసాద్ పాల్గొన్నారు.

కాజీపేటలో..

కాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులందరికీ వర్తింపచేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట బీజేపీ కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. 62వ డివిజన్ అధ్యక్షుడు భగవాన్ దాస్ ఉపాధ్యాయ ఆధ్వర్యంలో కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రయోజనాల కోసం కాకుండా పేదప్రజలకు లాభం చేకూరేలా వెంటనే అందరికీ నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న నాయకులను సీఐ రాజు ఆధ్వర్యంలో పోలీసులు అరెస్ట్ చేసి వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కాగిత రాజ్‌కుమార్ యాదవ్, శ్రీకాంత్, కరుణాకర్ రాజ్, కుమార్, శివాజీ గణేష్, మామిడాల నరేందర్ పాల్గొన్నారు.

డీజిల్‌షెడ్‌లో రైల్వే కార్మికులకు హెల్త్ క్యాంప్


హెల్త్‌క్యాంప్‌లో పాల్గొన్న రైల్వే కార్మికులు

కాజీపేట రూరల్: కాజీపేట డీజిల్ లోకోషెడ్‌లో గురువారం డీజిల్‌కాలనీ రైల్వే ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో వైద్య సిబ్బంది 165 మంది రైల్వే కార్మికులకు ఈసీజీ, షుగర్, బీపీ, పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కావాల్సిన వారిని గుర్తించి ఆయా వైద్య విభాగాల చికిత్స కోసం రెపర్ చేసినట్లు వైద్యులు తెలిపారు. హెల్త్‌క్యాంప్‌లో డీజిల్‌కాలనీ రైల్వే ఆస్పత్రి డీఎంఓ డాక్టర్ దీరజ్‌కుమార్, అంకిత్ కడె, భానుప్రకాష్, నాగరాజశేఖర్, రమేష్, రాజశేఖర్, కె.శ్రీనివాస్, భిక్షపతి, గిరిమిట్ల రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రైల్వే కార్మికులకు గిఫ్టుల ప్రదానం

కాజీపేట రైల్వే డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రిక్ లోకోషెడ్ కార్మికులకు గురువారం గిఫ్టులు ప్రదానం చేశారు. ప్రతి ఏటా ఆనవాయితీగా రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ కమిటీ నుంచి సభ్యులైన కార్మికులకు ఇనిస్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో గిఫ్టులు అందజేస్తారు. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ లోకోషెడ్‌లో సీనియర్ డీఈఈ, ఇనిస్టిట్యూట్ చైర్మన్ ప్రశాంత్ కృష్ణసాయి, డిజిల్‌లోకోషెడ్‌లో ఏడీఎంఈ భానుప్రసాద్, రాజశేఖర్, మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్ చేతుల మీదుగా గురువారం గిఫ్టులు అందించినట్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ తెలిపారు. కార్యక్రమంలో ఎం.రాజయ్య, జి.రాజేశ్వర్‌రావు, బి.మాధవరావు, ఎస్.ఆర్.ప్రశాంత్‌కుమార్, పి.ప్రవీణ్, పి.ప్రశాంత్, రవికిరణ్, ఎం.మహేష్, టి.ప్రవీణ్, కె.సాయిరాజ్, పాక వేదప్రకాష్, ఎస్.సదానందం పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

విద్యారణ్యపురి: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న హైదరాబాద్‌లో తెలంగాణా ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆ టీపీయూఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆముదాల దాత మహర్షి పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ డీఈఓ కార్యాలయం వద్ద ఆ ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. ఉపాధ్యాయులకు పీఆర్ కమిషన్ వేసి మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలన్నారు. కేజీబీవీల్లోని, మోడల్‌స్కూల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీయూఎస్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిని వీరస్వామి, బాధ్యులు సత్యనారాయణ, బాబురావు, నాంపెల్లి శేఖర్, బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

పదిశాతం విద్యార్థులే రాణిస్తున్నారు


మాట్లాడుతున్న డాక్టర్ అశోక్‌రెడ్డి

హసన్‌పర్తి: దేశంలోని స్కిల్స్ నివేదిక ప్రకారం ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్‌లో కేవలం పదిశాతం మంది విద్యార్థులు మాత్రమే రాణిస్తున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం బీ.టెక్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడారు. క్రమశిక్షణతోనే ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలిపారు. కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉపాధి సాధించే విధంగా తర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్ అకాడమిక్ అఫైర్స్ ప్రొఫెసర్ రాజగోపాల్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.కోమల్‌రెడ్డి, కో–ఆర్డినేటర్‌లు డాక్టర్ ప్రభాకరాచారి, డాక్టర్ శివశంకర్, ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎల్.సుధీర్‌రెడ్డి, ప్రొఫెసర్ కామాక్షి, ప్రొఫెసర్ శంకర్ పాల్గొన్నారు.

విలియంకేరి జయంతి వేడుకలు

వరంగల్: బైబిల్‌ను అన్ని భాషల్లోకి తర్జుమా చేసిన బాప్టిస్ట్ పితామహుడు విలియంకేరి 262వ జయంతిని వరంగల్ క్రిస్టియన్ సొసైటీ ఆధ్వర్యంలో పోచమ్మమైదాన్ జంక్షన్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పండ్లను పంపిణీ చేశారు. గంధం అరుణ్‌జేమ్స్, దీన్‌దయాళ్, రాజు, వినోద్, మార్టిన్‌లూథర్, ఐజయ, ప్రతాప్, రాజు, సాల్మన్, శ్రవణ్, ప్రణయ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రొఫెసర్ వెంకటయ్యకు సన్మానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మైక్రోబయాలజీ విభాగం అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటయ్యను గురువారం పలువురు సన్మానించారు. కార్యక్రమంలో కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ గడ్డం కృష్ణ, డాక్టర్ బ్రహ్మయ్య, డాక్టర్ నర్సింహారావు, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ మధుకర్‌రావు, డాక్టర్ చీకటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ బోర్డు ప్రారంభం

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్‌లో గల భవానీనగర్ కాలనీ ఎంట్రెన్స్ బోర్డును గురువారం ప్రారంభించారు. సందెల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బోర్డును ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఎల్లయ్య, మాచర్ల శేఖర్, గోవర్దన్, ఏకాంబరం, వెంకటస్వామి, దేవదాస్, కుమారస్వామి, వెంకట్ నారాయణ, నాగరాజు, రాంచందర్, వెంకటయ్య, రఫీ, జయరాజ్, సదానందం, ఎస్ఆర్‌వి, అబ్బులు, మేకరాజు, విలియమ్స్, సతీష్, యూత్ సభ్యులు అఖిల్, వినోద్, తంబి, ప్రశాంత్, మున్నా, బన్ని, హేమంత్, శివరాం, కరీం పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మి వ్రతాలు

హన్మకొండ కల్చరల్ : వరంగల్ ఎంజీఎం ఎదురుగా గల శ్రీరాజరాజేశ్వరీదేవి దేవాలయంలో శ్రావణమసోత్సవాల్లో భాగంగా మొదటి శుక్రవారం పురస్కరించుకుని నేటి ఉదయం 11గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరుగుతాయని దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు తెలిపారు. వ్రతంలో పాల్గొనే మహిళలు రుసుం చెల్లించవలసిన అవసరంలేదని, పూజాసామగ్రి తెచ్చుకోవాలని సూచించారు.

యూత్ కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

హన్మకొండ చౌరస్తా: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 9వ డివిజన్‌లో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కొడిపాక గణేష్ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ తోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ప్రజలకు వివరిస్తూ, సీఎం కేసీఆర్ ప్రజావ్యతిరేక విధానాలను కరపత్రాలను పంచుతూ ఎండగట్టారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రేపల్లె రంగనాథ్, నాయకులు కత్తుల కవిత, సందుపట్ల ధన్‌రాజ్, గాండ్ల స్రవంతి, జమీరుద్దీన్, అజ్గర్, బుచ్చమ్మ, సాంబరాజు, హర్షవర్దన్, బన్నీ, సాయిరాజ్, రోహన్, రోషన్, లక్కీ, సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనతో చేతివృత్తులకు మహర్దశ

వరంగల్ చౌరస్తా: విశ్వకర్మ యువజన పథకాన్ని కేంద్ర కేబినెట్ ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం వరంగల్ చౌరస్తాలో ప్రధాన మంత్రి మోదీ చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. నగరంలోని విశ్వకర్మ వ్యాపార, వాణిజ్య, కుల వృత్తుల కార్మికులు ప్రధాన మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ బాబు స్వీట్లు పంపిణీ చేసి, సంబురాల్లో పాల్గొన్నారు. విశ్వకర్మ యోజన పథకంతో విశ్వ బ్రాహ్మణులు తదితర కులవత్తుల వారికి రూ.2లక్షల వరకు రుణం మంజూరు చేస్తుందని, గరిష్టంగా 5శాతం వడ్డీతో ఈ రుణాన్ని అందించనుందని తెలిపారు. చేతివత్తుల వారికి రోజుకు రూ.500 ఉపకార వేతనంతోపాటు, శిక్షణ ఇచ్చిన తర్వాత పరికరాల కొనుగోలుకు రూ.15వేల ఆర్థిక సాయం అందచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ వరంగల్ జిల్లా కన్వీనర్ రామోజు మోహనా చారి, గ్రేటర్ వరంగల్ విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు వెంకట్, కట్ట ఈశ్వర్ ప్రాసాద్, వంగాల శ్రీనివాస్, కందుకూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే పోటీలు

కాజీపేట అర్బన్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు చిత్రకళ పోటీలు తోడ్పడుతాయని కేవీ ప్రిన్సిపాల్ మృదుల తెలిపారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని కేంద్రీయ విద్యాలయ వరంగల్ పాఠశాలలో గురువారం అజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా యంగ్ ఎంవోయిస్ ఇంటర్నేషనల్ సంస్థ సౌజన్యంతో దేశభక్తిని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన చిత్రకళ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కేవీకి చెందిన 6 నుంచి 10వ తరగతులకు చెందిన పది మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్, 20 మంది విద్యార్థులు జ్యూరీ అవార్డులతో పాటు ప్రశంస పత్రాలను సాధించడం అభినందనీయమని అన్నారు. చిత్రకళ టీచర్ అన్నాబత్తుల వెంకన్న పాల్గొన్నారు.

20న గద్దర్ యాదిసభ



నయీంనగర్: ఈ నెల 20న (ఆదివారం) హనుమకొండ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియంలో ప్రజా గాయకుడు గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్ యాది సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరుతూ వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంతోపాటు యూవత్ భారతదేశాన్ని పాటతో ఆలోచింపచేసే విధంగా సుదీర్ఘకాలం పాటు పీడిత ప్రజల పక్షపాతిగా ఆట, పాట, మాటలతో ప్రజలను చైతన్యవంతం చేసిన ప్రజాగాయకుడు గద్దర్ అన్నారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణం సాంస్కృతిక లోకానికి తీరని లోటన్నారు. బి.రమాదేవి మాట్లాడుతూ సియాసత్ మేనిజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ మృతి ప్రజాస్వామిక ఉద్యమాలకు తీరని లోటన్నారు. మోహన్ రాజ్, కుసుమ రంజిత్, ఎం.వెంగల్‌రెడ్డి, భరత్, బాల్‌రాజ్, అవినాష్, సంజీవ పాల్గొన్నారు.

యువకుడి మృతి

వరంగల్: ఎస్సారెస్పీ కాల్వలో పడి ఖిలావరంగల్‌కు చెందిన రాంచరణ్(18) గురువారం మృతి చెందాడు. పెద్దమ్మగడ్డ సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో యువకుడు పడిపోగా.. యువకుడి మృతదేహం పైడిపల్లి సమీపంలోని కాలువ వద్ద సాయంత్రం లభ్యమైంది. మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించినట్లు సీఐ మహేందర్ వెల్లడించారు.

'గణేష్‌కు తూర్పు టికెట్ కేటాయించాలి'

హన్మకొండ: ప్రముఖ న్యాయవాది, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ ఒద్దిరాజు గణేష్‌కు వరంగల్ తూర్పు నుంచి బీఆర్ఎస్ టికెట్ ఇవ్వాలని బ్రాహ్మణ ఐక్య వేదిక నాయకుల కోరారు. గురువారం హనుమకొండ హంటర్ రోడ్డులోని స్వగృహంలో మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ ఒడితల లక్ష్మీకాంతరావు, ఎమ్మెల్యే ఒడితల సతీష్ కుమార్‌ను బ్రాహ్మణ ఐక్య వేదిక నాయకులు కలిసి, శాలువా కప్పి సన్మానించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి గణేష్‌కు అవకాశం కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. స్పందించిన కెప్టెన్ లక్ష్మీకాంతరావు ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ ఐక్య వేదిక ప్రతినిధులు బి.వెంకటేశ్వరరావు, భద్రకాళి శేషు, గంగు ఉపేంద్ర శర్మ, వాణిదేవి, నాగేందర్ రావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చొని ఏఎన్ఎంల నిరసన

ఎంజీఎం: రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఏఎన్ఎంలు డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట చేస్తున్న ఆందోళన గురువారం మూడో రోజు కొనసాగింది. ఏఎన్ఎంలు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు మోహన్‌రావు మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా పనిచేసిన ఏఎన్ఎంలు పరీక్షలు రాసి ఎంపిక కావాలనే ప్రభుత్వ నిబంధన ఉపసంహరించుకోవాలన్నారు. కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, నర్మద, సరోజ, ప్రభావతి, భారతి, స్వరూప, విజయలక్ష్మి, రోజీ, వరలక్ష్మి, రజిత, సునీత, విజయ, తదితరులు పాల్గొన్నారు.